# స్క్రూటినీ పూర్తి

- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో నామినేషన్ల పరిశీలన
- తూర్పులో 6, పశ్చిమ 15, వర్ధన్నపేట 6, పరకాల 5, నర్సంపేట 5 తిరస్కరణ
- 15 వరకు ఉపసంహరణకు గడువు



వర్ధన్నపేటలో నామినేషన్లను పరిశీలిస్తున్న ఆర్వో అశ్వనీ తానాజీ వాకడే

వరంగల్, నవంబర్ 13: వరంగల్, హనుమకొండ జిల్లాల్లో నామినేషన్ల పరిశీలన ప్రక్రియ సోమవారం పూర్తయింది. వరంగల్ తూర్పు నియోజకవర్గ నామినేషన్లను రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. 37 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, ఆరు తిరస్కరణకు గురయ్యాయి. 31 సరిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా నన్నపునేని నరేందర్ వేసిన నాలుగు సెట్లనూ ఆమోదించారు. అలాగే, బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కొండా సురేఖ నామినేషన్లను రిటర్నింగ్ అధికారి ఆమోదించారు. బీఎస్పీ అభ్యర్థి చిత్రపు పుష్పిత లయ నామినేషన్ ఓకే అయింది. ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి త్రిపురోజు రవికుమార్ నామినేషన్ తిరస్కరణకు గురైంది. కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థి కొండా మురళీధర్‌రావు, బీజేపీ డమ్మీ అభ్యర్థి ఎర్రబెల్లి రేణుక అందించిన ధ్రువీకరణ పత్రాలు సరిగా లేకపోవడంతో తిరస్కరించారు. వీరితోపాటు స్వతంత్ర అభ్యర్థులు నరేశ్ సిద్ధం, బైరి వంశీకృష్ణ, ఎండీ నసీరుద్దీన్ నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఈ నెల 15 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది.

### పశ్చిమలో పూర్తయిన పరిశీలన

హనుమకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 35 మంది 55 నామినేషన్లు వేసినట్లు రిటర్నింగ్ అధికారి ఎల్.రమేశ్ తెలిపారు. వీటిని హనుమకొండ ఆర్డీవో కార్యాలయంలో క్షుణ్ణంగా పరిశీలించి, 15 తిరస్కరించినట్లు ఆయన చెప్పారు. బీఆర్ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డి, బీఎస్పీ నుంచి మాదారపు రవికుమార్, బీజేపీ అభ్యర్థి రావు పద్మ, తెలంగాణ ద్రావిడ ప్రజల పార్టీ నుంచి ఐలాపురం వేణుచారి, ధర్మ సమాజ్ పార్టీ నుంచి కోగిల రూప, మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్) నుంచి గడ్డం నాగార్జున, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి జంగా రాఘవరెడ్డి, అలయెన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫామ్స్ పార్టీ నుంచి గట్ల యుగేంధర్, అజాద్ సమాజ్ పార్టీ నుంచి సయ్యద్ షాజిహుషేర్, బహుజన్ రిపబ్లిక్ సోషలిస్టు పార్టీ నుంచి సీత రాజ్‌కుమార్, స్వతంత్ర అభ్యర్థులు ఎమ్మడి రవి, ఉల్లెంగుల యాదగిరి, మహ్మద్ ఖలీలొద్దీన్, కుందూరు కృష్ణ, గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం జక్కయ్య, మధుకర్ జన్ను, బొమ్మగాని భార్గవ్, పూసల సత్యప్రకాశ్ నామినేషన్లు ఓకే అయ్యాయి. పెండెం రాఘవరావు, నరేందర్ గొల్లెన, బంక రాజు, గుర్రం శాంతమ్మ, సాయిని రవీందర్, ఫారూక్ అహ్మద్ హసన్ మహ్మద్, సౌమ్యశ్రీ ఆకుతోట, డాక్టర్ నాయిని శ్రీగోదారెడ్డి, మూరతోటి కల్పన, ఎర్ర అశోక్, దామెర సుదర్శన్, యాదగిరి బొనగిరి, సయ్యద్ నయీమ్, సయ్యద్ ఖాజా నయీమొద్దిన్, బానోత్ విద్యాసాగర్ నామినేషన్లను తిరస్కరించారు.






వరంగల్: స్క్రూటినీ ప్రక్రియను పరిశీలిస్తున్న కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు షణ్ముగ రాజన్

### మూడు నియోజకవర్గాల్లో..


వర్ధన్నపేట/పరకాల/నర్సంపేట: స్క్రూటినీలో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గానికి సంబంధించి ఆరుగురు అభ్యర్థుల ఎనిమిది నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు వర్ధన్నపేట ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే తెలిపారు. 26 మంది 40 నామినేషన్లు దాఖలు చేశారు. వర్ధన్నపేట ఆర్వో కార్యాలయంలో ఆర్వో అశ్వినీ తానాజీ వాకడే, ఏఆర్వో విజయ్ సాగర్ ఆధ్వర్యంలో నామినేషన్లను పరిశీలించారు. ఇందులో ఆరుగురు అభ్యర్థుల 8 నామినేషన్ పత్రాల్లో సరైన వివరాలు లేకపోవడంతో తిరస్కరించారు. పరకాల నియోజవర్గంలో ఎన్నికల అబ్జర్వర్ గోపాలకృష్ణ, రిటర్నింగ్ అధికారి కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్లను పరిశీలించారు. 41 మంది నామినేషన్లు దాఖలు చేయగా, అందులో ఐదింటిని తిరస్కరించారు. బీజేపీ అభ్యర్థిగా పగడాల స్వర్ణలత, అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా యాదగిరి బొనగాని, స్వతంత్ర అభ్యర్థులుగా మంద సంధ్యారాణి, ఐలి సాంబయ్య, కుమ్మరి కన్నయ్య నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. 36 మంది అభ్యర్థుల పత్రాలు సరిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. నర్సంపేటలో ఐదు నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. 24 మంది 42 సెట్లు వేశారు. ఇందులో ఐదింటిని తిరస్కరించగా, 19 ఆమోదం పొందాయి. కార్యక్రమంలో ఏఆర్వో విశ్వప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తిరస్కరణకు గురైన వాటిలో గటిక అజయ్‌కుమార్, షేక్ హర్షియా, జంపాల వీరస్వామి, ఇమ్మడి బాబు, బోడ అనిల్‌కుమార్ నామినేషన్లు ఉన్నాయి.

### నిబంధనల మేరకే పరిశీలన జరగాలి

వరంగల్: ఎన్నికల సంఘం నిబంధనల మేరకే నామినేషన్ల పరిశీలన జరగాలని కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు షణ్ముగ రాజన్ అన్నారు. సోమవారం నామినేషన్ల పరిశీలనలో భాగంగా తూర్పు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. రిటర్నింగ్ అధికారి షేక్ రిజ్వాన్ బాషా నామినేషన్ల పరిశీలనను నిబంధలన ప్రకారమే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనర్ ఆర్వో అనీసుర్ రషీద్, అసిస్టెంట్ ఆర్వో ఇక్బాల్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.









నర్సంపేట: నామినేషన్లను పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి, పరకాల: స్రూటిని నిర్వహిస్తున్న అబ్జర్వర్ గోపాలకష్ణ, ఆర్వో శ్రీనివాస్

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

### కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు షణ్ముగరాజన్

ఖిలావరంగల్, నవంబర్ 13: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకుడు షణ్ముగరాజన్ అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం వరంగల్, ఖిలావరంగల్ మండలాల్లోని సీకేఎం కళాశాల, నెహ్రూ మెమోరియల్ పాఠశాల, ఎల్‌బీనగర్‌లోని మౌలాలి స్కూల్, ఆల్ నూర్ స్కూల్, కిడ్డీ వుడ్ స్కూల్, కాశీబుగ్గ ప్రభుత్వ పాఠశాల, నరేంద్రనగర్ హైస్కూల్, స్టాండర్డ్ హైస్కూల్, ఎన్‌పీఆర్‌నగర్ స్కూల్, శంభునిపేట హైస్కూల్, అనంతలక్ష్మి పాఠశాల, ఇండియన్ స్కూల్, వీనస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను తూర్పు ఆర్వో షేక్ రిజ్వాన్ బాషాతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. తూర్పు నియోజకవర్గంలో 231 పోలింగ్ కేంద్రాలు ఉండగా ఎన్నికల సంఘం మార్గనిర్దేశాల మేరకు 57 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు ఆర్వో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు కేంద్ర బలగాల మోహరింపు, లైవ్‌వెబ్ క్యాస్టింగ్ ఏర్పాట్లు ఉండేలా చూడాలన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్వోలు ఇక్బాల్, నాగేశ్వరరావు, వరంగల్ ఏఈసీపీ కిషన్ పాల్గొన్నారు.

## దత్తక్షేత్రంలో దీపావళి వేడుకలు

పోచమ్మమైదాన్, నవంబర్ 13: వరంగల్ ములుగురోడ్డులోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో దీపావళి వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సూక్త మహాక్ష్మీ యాగాన్ని వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా మహాలక్ష్మీ అమ్మవారికి శ్రీదత్త విజయానంద తీర్థ స్వామి విశేష పూజలు చేశారు. అలాగే, కొత్త నాణేలాతో అమ్మవారికి ధన అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగు వేల మందికి స్వామి రూపాయి నాణేలాను ప్రసాదంగా అందజేశారు. అనంతరం దత్తక్షేత్రంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు.



విశేష పూజలు చేస్తున్న విజయానంద తీర్థస్వామి

## భద్రకాళీని దర్శించుకున్న కేంద్ర ఎన్నికల పరిశీలకుడు

వరంగల్, నవంబర్ 13: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని ప్రసిద్ధ భద్రకాళి అమ్మవారిని కేంద్ర ఎన్నికల వ్యయ పరిశీలకుడు అమిత్ ప్రతాప్ సింగ్ దర్శించుకున్నారు. ఆదివారం ఉదయం భద్రకాళి ఆలయానికి వచ్చిన ఆయనకు ఈవో శేషుభారతి, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత ఆయన వల్లభ గణపతిని దర్శించుకొని భద్రకాళీ ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మహామండపంలో అర్చకులు ఆయనకు మహాశీర్వచనం ఇచ్చి అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి తీర్థప్రసాదాలు అందజేశారు.



అమిత్ ప్రతాప్‌సింగ్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

## సమాజ శ్రేయస్సు కోరిన కాళోజీ సోదరులు: 'అంపశయ్య'



కవయిత్రి అనిశెట్టి రజిత, ఉర్దూ కవి, విమర్శకుడు మసూద్ మిర్జా మహషర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

హనుమకొండ, నవంబర్ 13: తెలుగు సాహితీ ప్రపంచంలో రామలక్ష్మణులు లాంటివారైన కాళోజీ సోదరులు జీవించినంత కాలం రాజ్యం నిరంకుశ పోకడలను నిరసించి ప్రజల పక్షం వహించి సమాజ శ్రేయస్సును కోరారని ప్రముఖ సాహితీవేత్త, నవలాకారులు డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. హనుమకొండ సుబేదారిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హాలులో కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి అధ్యక్షతన సోమవారం సాయంత్రం జరిగిన కాళోజీ సోదరుల యాది సభకు కాళోజీ ఫౌండేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్ స్వాగతం పలుకగా అంపశయ్య నవీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కాళోజీ సోదరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అణచివేతకు గురవుతున్న పీడిత ప్రజల పక్షాన నిస్వార్థంగా పని చేయడమే కాకుండా నిద్రాణమైన తెలంగాణ సమాజాన్ని తమ కవిత్వంతో మేల్కొలిపిన గొప్ప కవి సోదరులని చెప్పారు. విద్యావేత్త, మానవ హక్కుల నేత ఎస్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో, దేశానికి స్వాతంత్ర్యం రావడానికి జరిగిన జాతీయోద్యమ సమయంలో రాష్ట్రంలో, దేశంలో ఏర్పడిన నిర్బంధ కాలాన్ని ఎదిరించి ప్రజల్లో చైతన్యం, ధైర్యం నింపిన గొప్ప కవి, ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు అని కొనియాడారు. నెల్లుట్ల రమాదేవి మాట్లాడుతూ కాలానికి, లోకానికి ప్రాతినిథ్యం వహిస్తూ ప్రజలకు అన్యాయం జరిగితే ఎంతటి వారైనా ఎదురించి పోరాడిన గొప్ప ధీశాలి కాళోజీ అని వివరించారు. 30 ఏళ్లుగా కాళోజీ ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలపై కార్యదర్శి వి.ఆర్.విద్యార్థి నివేదిక సమర్పించారు. అనంతరం ఫౌండేషన్ సంయుక్త కార్యదర్శి పొట్లపల్లి శ్రీనివాస్‌రావును సన్మానించారు. కవయిత్రి, సామాజిక ఉద్యమకారిణి అనిశెట్టి రజితకు ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్మారక పురస్కారం, ప్రముఖ ఉర్దూ కవి, విమర్శకులు మసూద్ మిర్జా మహషర్‌కు కాళోజీ రామేశ్వర్‌రావు స్మారక పురస్కారం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో కాళోజీ ఫౌండేషన్ సభ్యులు ఎండీ సిరాజుద్దీన్, కె.రామలక్ష్మి, విశ్రాంత ఆచార్యులు కాత్యాయని విద్మహే, గంట రామిరెడ్డి, వల్లంపట్ల నాగేశ్వరరావు, పాతూరి రఘురామయ్య పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు అన్ని వర్గాల మద్దతు: నన్నపునేని

కరీమాబాద్, నవంబర్ 13: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న బీఆర్ఎస్‌కు అన్ని వర్గాల ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తున్నదని ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. 32వ డివిజన్‌లో సోమవారం రాత్రి బీఆర్ఎస్‌కు మద్దతు తెలుపుతూ నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. తాను ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో తూర్పు నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పల్లం రవి, డివిజన్ అధ్యక్షుడు పొగాకు సందీప్, నాయకులు నాగపురి సంజయ్‌బాబు, బత్తుల కుమార్, కొండ రాజు, జీ రవీందర్ పాల్గొన్నారు. అనంతరం ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారిని ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ సందర్భంగా 32వ డివిజన్‌కు చెందిన పలువురు చిన్నారులు తమ పాకెట్ మనీని ఎన్నికల ఖర్చు కోసం ఎమ్మెల్యేకు విరాళంగా అందజేశారు. వారికి నన్నపునేని కృతజ్ఞతలు తెలిపారు.



ఎమ్మెల్యే నరేందర్‌కు విరాళం అందజేస్తున్న చిన్నారులు

**బహిరంగ ప్రకటన**

ఇందుమూలముగ సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా ! నా Client అయిన శ్రీ యారవ శ్యాంసుందర్ రెడ్డి తండ్రి : పెంటరెడ్డి నివాసం : ఇంటి నెం. 1-8-403 బాలసముద్రం, హన్మకొండ గారు, బాలసముద్రం హన్మకొండ జిల్లా ఇంటి నెం. 1-8-403, 266.66 చదరపు గజములు దీనికి సరియగు 222.95 చ.మీటర్లు గల RCC గృహము మరియు ఖాళీ స్థలమును శ్రీ మూల జనార్ధన్ రెడ్డి తండ్రి : రాఘవరెడ్డి రెసిడెన్సీ పెద్దపల్లి జిల్లా గార్ల నుండి రిజిస్టర్ దస్తావేజు నెం. 6233/2002 తేది : 16-11-2002, ద్వారా కొనుగోలు చేసియున్నారు. నా యొక్క Client అమ్మినవారు అయిన శ్రీ మూల జనార్ధన్ రెడ్డి, తండ్రి : రాఘవరెడ్డి గారు ఇట్టి ఆస్తిని రిజిస్టర్ దస్తావేజు DOC No. 4522/1971, తేది: 15-11-1971 ద్వారా కొనుగోలు చేసియున్నారు. ఇట్టి Original Link Document Register దస్తావేజు నెం. 4522/1971 తేది : 15-11-1971 జిరాక్స్ కొరకు పొయేటప్పుడు బాలసముద్రం నందు పోయినది. కావునా నా Client యొక్క Original Link Document Register దస్తావేజు నెం. 4522/1971, తేది: 15-11-1971 గల సదరు పైన తెల్పిన ఆస్తికి సంబంధించిన Original (Link) రిజిస్టర్ విక్రయ దస్తావేజు ఎవరికైనా దొరికినచో ఈ దిగువ అడ్రస్ నందు అందజేయగలరు. సదరు దస్తావేజును ఎవరైనా ఏ విధంగా అయిన దుర్వినియోగపరిచినచో నా Client తీసుకొనిపోవు సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులుకాగలరు. అదే విధంగా తేది: 26-10-2023 రోజున సుబేదారి పోలిస్‌స్టేషన్ నందు ఇందుకు సంబంధించిన Complaint కూడా ఇచ్చి, ధృవపత్రం నా Client పొందియున్నారు. సదరు పైన తెల్పిన ఒరిజినల్ రిజిస్టర్ దస్తావేజు (Link Doumint) విషయమై ఎవరికైనా ఎలాంటి అభ్యంతరాలు ఉన్నచో తగిన సాక్ష్యాధారాలలో ఈ క్రింది అడ్రస్ యందు 7 రోజులలో తెలుపగలరు.

ఇట్లు **A. సుదర్శన్‌రావు** న్యాయవాది (నాటరి)
2-5-83484/4-4 నక్కల గుట్టు, హన్మకొండ,
Cell No. 9849699890.